ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025
5
శ్రీ సత్యసాయి





పుట్టపర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రశ్నార్థకంగా బిటిపి మనుగడ..!

- ◆ కర్నాటకలో బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం.?
- ◆ ఈ నిర్మాణం జరిగితే బిటిపికి నీరు రావడమే గగనమే
- ◆ ప్రాజెక్టు ఎగువన వేదవతి నది పరివాహక ప్రాంతం



ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరు అందించే భైరవానితప్ప ప్రాజెక్టు(బిటిపి) రిజర్వాయర్‌కు మరో ముప్పు ఎదురు కానుంది. కర్నాటక రాష్ట్రం చెల్లకెరే తాలూకా రాష్ట్ర సరిహద్దు గుడిపల్లి (గుడిహళ్లి) తప్పగోండనహళ్లి గ్రామాల నడుమ వేదవతి నదిపై రోడ్ కం బ్యారేజ్ నిర్మాణానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చెల్లకెర ఎమ్మెల్యే గురుమూర్తి విజ్ఞప్తి మేరకు బ్యారేజ్ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం రూ.31.40 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్మాణం జరిగితే భైరవానితిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్‌కు వేదవతి నది నీరు రావడం ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఇదే జరిగితే బిటిపి మనుగడే ప్రశ్నార్థం అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే అరకొర నీరు వస్తున్న నేపథ్యంలో మళ్లీ ప్రాజెక్టు పైన మరో నిర్మాణం జరిగితే వచ్చే నీళ్లు కూడా రాని పరిస్థితి నెలకొంటుంది.

ఆరున్నర దశాబ్దాల క్రితం వేదవతి నదిపై ఆంధ్ర రాష్ట్ర సరిహద్దున రెండు టిఎంసిల సామర్థ్యంతో భైరవాతిప్ప ప్రాజెక్టు రిజర్వాయర్‌ను నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించాక నిబంధనల మేరకు ఈ ప్రాజెక్టు ఎగువన వేదవతి నదిపై ఎలాంటి ఆనకట్టలు, రిజర్వాయర్లు నిర్మించరాదు. ఇందుకు విరుద్ధంగా ఈ మధ్యకాలంలో వేదవతి నదిపై కర్ణాటక రాష్ట్రంలో మూడు చోట్ల ఆనకట్టలు, బ్యారేజీలు నిర్మించారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు. దీంతో బిటి ప్రాజెక్టు రిజర్వాయర్‌కు నీటి రాక గగనమైంది. గతంలో ఏడాదికి రెండు పంటలకు 12వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లభించేది. కర్ణాటకలో అక్రమ ఆనకట్టలు, కట్టడాలు నిర్మించాక మూడు, నాలుగు ఏళ్లకు ఓసారి కానీ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీరు అందలేదు. రిజర్వాయర్‌కు జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకం కింద సాగునీటిని అందించాలని పదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం మూడుసార్లు భూమి పూజలు, శంకుస్థాపనలు చేసింది. అయినా ఇప్పటివరకు కాలువలు తవ్వడం, నీటిని మళ్లించడం పనులు జరగలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అధికారం చేపట్టిన ఏడాది కాలంలో రెండు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో బిటిపికి ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. గతంలో రూ.968 కోట్ల అంచనాతో తయారుచేసిన ఎత్తిపోతల పథకానికి ఏడాదికి కనీసం రూ.250 కోట్లతో మంజూరు చేసినా పూర్తి చేసేందుకు నాలుగేళ్లు పడుతుంది. ఇప్పటివరకు ఈ ఎత్తిపోతల పథకానికి అవసరమైన నిధులు మంజూరు చేయలేదు. ఇటీవలే పనులు చేపట్టేందుకు భూమిపూజ చేశారు. నిధుల కేటాయింపు, మంజూరు లేకుండా పనులు ఎలా జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంగా తలపెట్టిన బ్యారేజ్ కం బ్రిడ్జిని అడ్డుకోకపోతే బీటీ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు వచ్చే కొద్దిపాటి నీరు కూడా రాకుండా పోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు ఈ అక్రమ కట్టడం నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు



ధర్మవరంలో గడ్డిమొక్కలు తింటూ నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలియజేశారు. శుక్రవారం నాడు హనుమాన్ సర్కిల్ నుంచి బస్టాండ్, గోకులం, గణేష్ సర్కిల్ వరకు మున్సిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీవో నెంబర్ 30 ప్రకారం కనీసం వేతనాలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంజినీరింగ్ కార్మికులకూ వర్తింపజేయాలని తెలియజేశారు. హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో శనివారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు రమణ, కార్యదర్శి రమేష్, నాయకులు గణేష్, వెంకటేష్, సద్దాం, గంగాద్రి పాల్గొన్నారు.

ధర్మవరంలో ఒంటికాలిపై నిరసన

ధర్మవరం రూరల్ : తమ హక్కుల సాధన కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పదకొండో రోజు శుక్రవారం తమ నిరసన కొనసాగించారు. ధర్మవరం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆకులు తింటూ వినూత్న నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బొగ్గు నాగరాజు, జయకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,000 మంది పైగా ఇంజనీరింగ్ కార్మికులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన 17 రోజుల సమ్మెలో మోసపోయారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కొత్త ప్రభుత్వం ఈ సమస్యలపై ఎలాంటి స్పందన చూపలేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం వేతనాలు పెంపు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, జీవో 36 అమలు, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు వంటి డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జులై 12 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని, ఇప్పటికే సిడిఎంఎకు సమ్మె నోటీసు అందజేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, బాబు కాటమయ్య, చంద్ర శేఖర్ రెడ్డి, మేకల శీనా, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి మహిళలంటే గౌరవం లేదు : ఎమ్మెల్యే



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి అధినేత జగన్, ఆపార్టీ శ్రేణులకు మహిళలంటే గౌరవం లేదని, మహిళలను కించపరచడం, వారి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడడం ఆనవాయితీగా మారిందని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు మండిపడ్డారు. పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ వేదికగా మహిళలను అవమానపరిచారని, సాక్షి డిబేట్‌లో అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేశారని, కాకినాడ మాజీ ఎమ్మెల్యే మహిళల గురించి అత్యంత జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేశారని, వైసిపి సోషల్ మీడియాలో షర్మిలపై అవమానించేలా పోస్టులు పెట్టారన్నారు. తాజాగా కోవూర్ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టిడిపి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేశాడన్నారు. ఇందులో ఏ ఒక్క సంఘటనపై కూడా జగన్ నోరు మెదపలేదంటే ఆయన వ్యక్తిత్వం ఏంటో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డిలో పశ్చాత్తాపం లేకపోగా, తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం అతని అహంకారానికి నిదర్శనం అన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడిన వ్యక్తులను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. ఎవరు ఎన్ని ముందస్తు బెయిల్స్ తీసుకున్నా, అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా సరే చట్టం తీసుకునే చర్యలకు తలొగ్గక తప్పదన్నారు.

శంకరగల్లులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుడిబండ : మండలంలోని శంకరగల్లు గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. వారు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను వివరించగా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సర్పంచి నరేంద్ర, హనుమంతరాయప్ప, లక్ష్మీనారాయణప్ప, బాదిపల్లెప్ప, లాయర్ లక్ష్మీనారాయణ, శివకుమార్, మద్దనకుంటప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రికి యాదవ సంఘం సన్మానం



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

యాదవుల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ శ్రీవేణు మాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ కు వినతి పత్రం ఇచ్చారు. వారు శుక్రవారం ధర్మవరం పట్టణంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలు, పూలబొకేలతో సన్మానించారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవులు విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్ని రకాలుగా వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆగష్టులో సోమందేపల్లిలో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ, సోమందేపల్లి యాదవ సంఘం అధ్యక్షులు మహేష్, గోపాల్, లక్ష్మీ కాంత్, ధను, రాజగోపాల్, మైలార్, శివ, శివశంకర్, రమేష్, నాగరాజు, సురేందర్, ఆదినారాయణ, ఎల్ఐసి అంజి, మధు, ప్రభాకర్, లక్ష్మీనరసింహులు, హనుమంతు, కిష్టప్ప, వెంకటేష్, శీను, రాము, ఓబులేష్, రామకృష్ణ, బద్రి పాల్గొన్నారు.

డిగ్రీలో 'డబుల్ మేజర్'ను కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

మడకశిర : డిగ్రీలో డబల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట, ప్రధాన రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పట్ల సవతి ప్రేమ చూపిస్తోందన్నారు. పరోక్షంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు తోడ్పాటు అందిస్తుందన్నారు. ఇంటర్ ఫలితాలు వచ్చి రెండు నెలలవుతున్నా డిగ్రీ అడ్మిషన్లకు సంబం ధించి విధి విధానాలు ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని, డబుల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతోందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షాహిద్, లక్ష్మినరసింహ, సురేష్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు వస్తువులు అందజేత

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలకు శుక్రవారం సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభయ ఫౌండేషన్ సహకారంతో రూ. 80 వేలు విలువ చేసే వస్తువులు, సుభాష్ సంఘం రూ. 1.25 లక్షల విలువ చేసే వస్తువులను అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వారు మొత్తం రూ. 2.05లక్షల విలువ చేసే బల్బులు, ఫ్యాన్స్, టబ్ లైట్స్, తదితర వస్తువులు అందజేసినట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. సాహితీ గగన్‌మహల్ అధ్యక్షులు జె.ప్రతాపరెడ్డి, అభయ ఫౌండేషన్ అధ్యక్షులు సుంకు బాలచంద్ర, ఎంజెపి ప్రిన్సిపల్ అనిత లైట్స్, ఫాన్స్, వాల్ మౌంటెన్ ఫాన్స్, స్ట్రీట్ లైట్స్ ప్రారంభించారు. వీటితో గురుకులంలో ఉన్న 250 మంది బాలురకు ప్రయోజనం చేకూరుతుందని ప్రతాపరెడ్డి తెలపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరేష్, ఉపాధ్యాయులు రమణ, అశోక్, పాపన్న, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాత ప్రతాప్‌రెడ్డి

తూతూమంత్రంగా మండల మీట్

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ప్రమీల అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఏ ఒక్క సమస్యపై కూడా చర్చించకుండా కేవలం అధికారుల ప్రసంగాలతోనే సమావేశం ముగించడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. అధికారులు శాఖల పరంగా తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు త్వరలోనే పరిష్కరిస్తామని తూతూ మంత్రంగా హామీ ఇచ్చారు. ఒడిగేపల్లి సర్పంచి నరసింహమూర్తి మాట్లా డుతూ మా పంచాయతీలో వీధి దీపాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఐసిడిఎస్ సిడిపిఒ శాంతిలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడా నికి ప్రతిఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఇఒ గోపాల్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం సొమ్ము అందని అర్హులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ నరేంద్రకుమార్, తహశీల్దార్ మారుతి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు

ఘనంగా ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈయూ రీజినల్ ఉపకారదర్శి బివి.నరసింహులు మాట్లాడుతూ ఈయూ ఆవిర్భావం, చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో రీజినల్ సభ్యులు టైగర్ సిద్దగంగప్ప, డిపో అధ్యక్షులు జిఎండి.రఫిక్, డిపో కార్యదర్శి పి.రంగనాథ్, ప్రచార ఉపకార్యదర్శి నారాయణ స్వామినాయక్, గ్యారేజ్ కార్యదర్శి కెటి.స్వామి, యూనియన్ నాయకులు కె.గోపాల్, జె.ప్రకాష్ నాయుడు, కలశప్ప, కృష్ణ, దాసప్ప, గ్యారేజ్ సభ్యులు మహేష్, రామ్మోహన్, అమర్‌నాథ్‌రెడ్డి, గంగరాజు, అశోక్, నూర్, స్టోర్ సూపర్వైజర్ రియాజ్‌బాషా, పిటిడి ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి చెప్పినా స్పందించని విద్యాశాఖ అధికారులు

హిందీ పండిట్‌ను నియమించాలని మోకాళ్లపై నిల్చోని చిన్నారుల నిరసన



మోకాళ్లపై నిలబడి అధికారులను వేడుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంటలో ఉన్న పాఠశాలలో హిందీ పండిట్ ను నియమించే విధంగా చర్యలు చేపట్టాలని స్వయానా జిల్లా మంత్రి సవితమ్మ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ను ఫోన్ చేసి ఆదేశించినప్పటికీ విద్యాశాఖ అధికారుల్లో చలనం మాత్రం కనిపించడం లేదు. తెలుగు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కాక వలస కార్మికుల పిల్లలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. తమ పాఠశాలకు హిందీ పండిట్ ను నియమించి ఆదుకోవాలని వలస కార్మికుల పిల్లలు శుక్రవారం మోకాళ్లపై నిలబడి విద్యాశాఖ అధికారులు మొక్కుతూ విద్యాశాఖ అధికారులను వేడుకొన్న సంఘటన ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తెప్పించాయి.

ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్టకూటి కోసం పొట్ట చేత పట్టుకుని బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వందలాదిమంది వలస కార్మికులు హిందూపురం రూరల్ మండలానికి వచ్చారు. వీరందరూ తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వీరి పిల్లలు సుమారు 100 మందికి పైగా తూమకుంట లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. తెలుగు పాఠశాల కావడంతో తెలుగులో చెప్పే పాఠాలు వలస కార్మికుల పిల్లలకు అర్థం కావడం లేదు. విద్యార్థులు పడే బాధను అర్థం చేసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుగొండకు వెళ్లి జిల్లా మంత్రి సవితను కలిసి సమస్యను వివరించి, వెంటనే పాఠశాలకు హిందీ పండిట్ ను నియమించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ కు ఫోన్ చేసి పాఠశాలకు హిందీ పండిట్ ను నియమించాలని ఆదేశించారు. ఆమె ఆదేశించి ఆరు మాసాలు గడిచినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. మంత్రి ఆదేశాలను నిర్లక్ష్యం చేసి ఇంతవరకు ఆ పాఠశాలకు హిందీ పండిట్ ను నియమించలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా ప్రధానోపాధ్యాయులు వలస కార్మికుల పిల్లలు పడే బాధల గురించి వివరించి పదే పదే అడుగుతున్నప్పటికీ హిందీ పండిట్ నియమకంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. చివరకు పాఠశాలలో చదివే వలస కార్మికుల పిల్లలందరూ కలిసి మోకాళ్లపై నిలబడి విద్యాశాఖ అధికారులు 'మీకు చేతులెత్తి మొక్కుతాం మా పాఠశాలకు హిందీ పండిట్ ను నియమించి మమ్మల్ని ఆదుకోండి' అంటూ వేడుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారుల్లో చలనం వచ్చి పాఠశాలకు హిందీ పండిత్ ను నియమిస్తారా లేదా వేచి చూడాల్సుంది.

చేనేత పరిశ్రమను కాపాడండి

సోమందేపల్లి : చేనేత పరిశ్రమను కాపాడా లని, 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పింఛను ఇవ్వాలని ఎపి చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి శీలా నారాయణ స్వామి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు ఏటా రూ. 24 వేలు, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలని, జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, 3 సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు వర్క్‌షెడ్ నిర్మించా లని, రాయితీపై ఎలక్ట్రానిక్ జాకార్డ్ మిషన్లు ఇవ్వాలని, పరికరాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో దాసరి సుధాకర్, ఉడుముల నారాయణస్వామి, దేవాంగం వెంకటేశు, బాలం కృష్ణయ్య, గీతానగర్ రామాంజ నేయులు, బిటి.రాజు, నవీన్, జయరాములు పాల్గొన్నారు.

అరగంట యోగా చేయాలి

రొద్దం : ప్రతి ఒక్కరూ రోజూ అరగంట యోగా చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి సిఎస్.సోమశేఖర్ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్యకరమైన శారీరక అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. రోజూ అర గంట యోగాసనాలు వేయడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యానికి సంబంధించి ఏ చిన్న అనుమానం వచ్చినా సమీపంలోని వైద్యుడిని సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నూతన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శశికళ, పిహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ, సూపర్వైజర్ బేబీరాణి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైసిపి

రొద్దం : 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైసిపి నాయకులు మండలంలోని దొడఘట్ట గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేసి ప్రజలను వంచిస్తున్న తీరును వివరించారు. అలాగే వైసిపి రూపొందించిన 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరితో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి నాగమ్మ తిమ్మయ్య, జడ్పీటీసీ పద్మ అక్కులప్ప, ఎంపిటిసి బాలాజీ, ఎన్.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మండల కన్వీనర్ చిలకల రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గుడిబండ : మండల వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల వేరే పాఠశాలలకు వెళ్లిన 13 మంది ఉపాధ్యాయులను శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం గోవిందప్ప ఆధ్వర్యంలో 13 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల్లో రూపా రాణి, శ్రీదేవి, ముకుంద, జయమ్మ, నాగమణి, సారా, నరసింహమూర్తి, రామకృష్ణ, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయికృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో పిఈటి అజారుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని హరే సముద్రం జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన హెచ్ఎం సునీతను శుక్రవారం రిటైర్డ్ ఎంఇఒ అశ్వత్థమప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అశ్వత్థమప్ప మాట్లాడుతూ హెచ్ఎం సునీత సేవలను కొనియాడారు. అలాగే బదిలీపై వచ్చిన నూతన హెచ్ఎం, ఉపాధ్యాయులకు పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. పాఠశాల, విద్యాభివృద్ధి కోసం వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ నాగరాజు, గ్రామస్తులు నరసింహమూర్తి, అడివన్న, ప్రభాకర్, నరసయ్యగౌడ్, శ్రీనివాస్, నాగరాజ్ పాల్గొన్నారు.

చెత్తను తరలించడానికి ట్రాక్టర్ ఏర్పాటు

గోరంట్ల : మండలంలోని బూదిలి పంచాయతీలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించడానికి ఏర్పాటు చేసిన కొత్త ట్రాక్టర్‌ను శుక్రవారం ఎంపిడిఒ నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ ట్రాక్టర్‌ను ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సైకిల్ ద్వారా చెత్తను తరలించడానికి సాధ్యం కాకపోవడంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఆంజనేయులు, ఎంపిటిసి మంజునాథ్, సెక్రటరీ జయపాల్‌రెడ్డి, నాయకులు ఈడిగ రవి, ప్రభు, శంకర్, లక్ష్మీపతి, విక్రమ్‌కుమార్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం మరోసారి వాయిదా

రొద్దం : కోరం లేక మండల సర్వసభ్య సమావేశం మరోమారు వాయిదా పడినట్లు ఎంపిడిఒ రామ్ కుమార్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అధికారులు సమావేశ గదిలో వేచి ఉన్నారు. వారు ఎంతసేపు ఎదురు చూసినా ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో కోరం లేక మండల సమావేశాన్ని వాయిదా వేశారు. మరో 3 నెలలు సమావేశం జరగకపోతే దాదాపు 6 నెలలు సమావేశాలు వాయిదా పడినట్లు అవుతుంది. దీంతో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, చేయబోయే అభివృద్ధి పనులు, సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగే అవకాశాలు లేవు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. సమస్యలు పేరుకుపోతాయనడంలో సందేహం లేదు.



మండల సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ ఫైరోజాబేగం వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉందని ఎక్కడ పెచ్చులు అక్కడ ఓడిపోతున్నాయని గోడలు చీలిపోయాయని డాక్టర్ భాను ప్రకాష్ డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అలాగే పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన ఆకుతోటి పల్లి గ్రామస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి జనసేన స్థానిక నాయకులు విరాళం అందజేశారు. పాఠశాలలో సమావేశం జరపటానికి డయాస్ (స్టేజ్) లేకపోవటంతో డయాస్ నిర్మాణానికి జనసేన పార్టీ నాయకుడు కొండ బయన్న సతీష్ తన వంతుగా రూ. 50వేల ను ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణానాయక్‌కు శుక్రవారం అందజేశారు. దీంతో ఉపాధ్యాయులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థుల అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ సాయి మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోటుమర్లలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి పాఠశాలలో నిర్వహించిన మేగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఎంపిడిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఒకరినొకరు అర్థం చేసుకుని సమన్వయంతో పాఠశాల అభివృద్ధికి కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల స్థితిగతుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీకి సంబంధించి చెత్త తరలింపు వాహనాలు, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన వాహనాల స్థితిగతులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన ట్రాక్టర్లు, కంపెక్టర్స్, స్కిడ్ లోడ్లు వాహనాలను డ్రైవర్ల సమక్షంలో మున్సిపల్ ఇంజనీర్ దస్తగిరితో కలిసి పరిశీలించారు. ఈ వాహనాలు చిన్న, చిన్న రిపేర్లు కారణంగా నిలిచిపోయి శానిటేషన్ పనులకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఆయా వాహనాల నిర్వాహణ కోసం ఒక ఇంజినీర్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు చెప్పారు.

సచివాలయ సిబ్బందికి వీడ్కోలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

బదిలీపై వెళుతున్న మండలంలోని శెట్టిపల్లి సచివాలయ సిబ్బందికి శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన సచివాలయ సిబ్బంది బదిలీల అనంతరం, శెట్టిపల్లి గ్రామ సచివాలయ సిబ్బందికి గ్రామ సర్పంచి చామంతి, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, వైఎస్సార్సీపీ నాయకులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. కార్యక్రమానికి హిందూపురం నియోజకవర్గ సీనియర్ నేత కొండూరు వేణుగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిశంకర్ రెడ్డి, నాగరాజు, నవీన్, రావణ్, రాజారెడ్డి, నరసింహారెడ్డి, రఫీక్, స్వామి, నరసారెడ్డి, శివారెడ్డి, గోవింద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆరోగ్యం పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ఆరోగ్యం పట్ల నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్, పిహెచ్‌సి సిబ్బంది, జిల్లా వైద్య సిబ్బంది, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సునీత, డిప్యూటీ డెమో బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ నాగ దుర్గాదేవి, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'ఇంటింటి' పర్యటనలో విషాదం

గుండెపోటుతో టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - బుక్కపట్నం



మృతుడు గంగన్న (ఫైల్‌ఫొటో)

మండల కేంద్రంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో విషాదం చోటు చేసుకుంది. టిడిపి నాయకుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈసందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలో ఎమ్మెల్య పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు చాక్లెట్ గంగన్న ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి ఎమ్మెల్యే వెళ్లారు. దీంతో కుటుంబసభ్యులు ఎంతో సంతోషంతో ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించి ఆతిథ్యం ఇచ్చారు. అక్కడినుంచి కాలనీలో కొన్ని ఇళ్ల వద్దకు ఇంటింటికి కార్యక్రమానికి వెళ్లిన ఎమ్మెల్యేకు గంగన్న ఒక్కసారిగా ఇంట్లోనే అనారోగ్యంతో కుప్పకూలారని అక్కడున్న కార్యకర్తలు సమాచారం ఇచ్చారు. దీంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపేసి తీవ్ర అస్వస్థకు గురైన గంగన్నను ఎమ్మెల్యే తన సొంత వాహనంలోనే పుట్టపర్తి ఆసుపత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. గంగన్న గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొనడంతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయాన్నివెంటనే మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కి ,తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గంగన్న మృతి అత్యంత బాధాకరమని ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ మరియు పల్లె కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాకే యశోద రాయుడు, టీడీపీ నాయకులు గంగాధర్, వెంకట రాముడు,మాజీ ఎంపీపీ బాలు, లావణ్య గౌడ్, ఎర్ర కేసి, సయ్యద్ బాషా, సుధీర్,మంజు , అంజి, అశోక్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

మూడేళ్ల క్రితం భార్య ఆత్మహత్య అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు

ప్రజాశక్తి - కదిరి టౌన్



తండ్రి మృతదేహం వద్ద పిల్లల బేల చూపులు

అభం శుభం తెలియని ఆ ముగ్గురు పిల్లల తల్లి మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ప్రస్తుతం తండ్రి హత్యకు గురయ్యాడు. దీంతో పిల్లలు అమాయకంగా తన నాన్నకు ఏమైందన్న ఆలోచనతో తండ్రి మృతదేహాన్ని చూస్తూ ఉన్నారు. ఇప్పటికే తల్లి ప్రేమకు దూరమైన పిల్లలు తండ్రి మరణంతో వారు అనాథలుగా మారారు. వారి ఆలనాపాలనా చూసే ఇంకా దిక్కు ఎవరున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కదిరి రూరల్ మండలం బండవారిపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబందించి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.

కదిరి రూరల్ మండలం బండవారి పల్లెలో నవీన్ (35)కు ముగ్గురు పిల్లలు. అతని భార్య మూడేళ్ల క్రితం ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటినుంచి వరుసగా 6,8, 10 సంవత్సరాల తన ఇద్దరు బాలికలు, ఒక బాలుడి ఆలనాపాలన నవీన్ చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో నవీన్ శుక్రవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యాడు. ఉదయం గ్రామ సమీపంలోనీ చెట్లలోకి బహిర్భూమికి వెళ్లిన నవీన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తలపై రాయితో బాది దారుణంగా హత్య చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని కదిరి యుపిఎస్ సిఐ నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూస్ టీం రప్పించి పరిశీలించి హత్యకు కారుకులను పట్టుకొని శిక్షిస్తామని సిఐ తెలిపారు. తండ్రి మతితో ముగ్గురు చిన్నపిల్లలు అనాథలుగా మారారు.

నేరాలు ఘోరాలు

ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి గాండ్లపెంట

మండల కేంద్రంలో గురువారం రాత్రి నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. కదిరి రాయచోటి ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు హోటళ్లలో, ఎంపీడీవో ఆఫీస్ పక్క వీధిలో రెండు ఇళ్లలో చోరీ జరిగిందని పోలీసులు తెలిపారు. పి మస్తాన్‌వలి ఇంట్లో దాదాపు నాలుగు తులాల బంగారు పదివేల రూపాయలు నగదు, టైలర్ సుభహాన్ దుకాణంలో విద్యార్థులు దుస్తులు దాదాపు పది జతలు ,కదిరి రాయచోటి ప్రధాన రహదారులు పక్కన ఉన్న నాగ కుమారి టిఫిన్ హెూటల్లో దాదాపు రెండు బియ్యం ప్యాకెట్లు గ్యాస్ సిలిండర్, సిగరెట్ ప్యాకెట్లు చోరీ అయ్యాయి. అలాగే షాదిక్ ఛాయ దునియా హోటల్‌లో దాదాపు పదివేల రూపాయల విలువజేసే మిక్సీ, సిగరెట్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ పిలిపించారు. చోరీ జరిగిన ప్రాంతాలను కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా, నల్లచెరువు ఎస్ఐ మక్బూల్‌బాషా పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ గంగాధర్ తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ శివారులోని బైపాస్ రోడ్డు ప్రక్కన అటవీప్రాంతంలో జరిగిన ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. ధర్మవరం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకేసు వివరాలను వెల్లడించారు. ముదిగుబ్బ శివారులోని బైపాస్ రోడ్డు ప్రక్కన అటవీప్రాంతంలో చిన్నబుడ్డం గుట్ట వద్ద గల అంకె పవన్ కుమార్ అనే వ్యక్తి పొలంలో ఒక మగ వ్యక్తి మృతదేహం తల లేకుండా మొండెం మాత్రమే ఉండి, శవం నుండి సుమారు 50 మీటర్ల దూరంలో తల పడి ఉండి, శవం ప్రక్కనే ఒక కొత్త స్కూటీ నిలబెట్టి ఉండటాన్ని ముదిగుబ్బ గ్రామస్తులు ఈనెల 3న పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహం పక్కన ఉన్న స్కూటీ, మొబైల్ ఆధారంగా మృతుడు తనకల్లు మండలం ఎర్రగుంటపల్లికి చెందిన బుగుడే విశ్వనాథ్(42)అని ప్రస్తుతం అతను కదిరిలోని శివాలయం వీధిలో కాపురం ఉంటున్నాడని పోలీసుల విచారణలో తేలింది. మృతుడి భార్య బుగుడే శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మృతుని ఫోన్ కాల్ డేటా ఆధారంగా అనుమానితులను గుర్తించి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ముదిగుబ్బ మండలం, రాళ్ళ-అనంతపురము క్రాస్ వద్ద, జాతీయ రహదారిపై ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ హత్యకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమని చెప్పారు. ఈ సమావేశంలో ముదిగుబ్బ ఆప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సి ఐ శివ రాముడు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మిస్సింగ్ ... కేసు నమోదు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన మహిళ మిస్సింగ్ అయినట్లు ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బత్తల బాల పెద్దన్న భార్య 48 సంవత్సరాల నరసమ్మ శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. చుట్టుపక్కల ఇళ్లలోనూ, గ్రామంలోనూ వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదన్నారు. దీంతో నరసమ్మ భర్త బాల పెద్దన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యమాలతో సమస్యలు పరిష్కారం : సిపిఎం



జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎర్రజెండా ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఈనెల 27, 28 వ తేదీలలో కదిరిలో జరిగే

27,28న కదిరిలో జిల్లా మహాసభలు

సిపిఎం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి విధానాలపై రాష్ట్రంలో కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల తరపున అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పోరాడుతోందన్నారు. కార్మిక రంగ సమస్యలపై కార్మికులు చేపట్టిన పోరాటాలకు సిపిఎం ఉండగా నిలిచిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ కోసం, పంట నష్ట పరిహారం కోసం, వ్యవసాయ కూలీల సమస్యలు, సామాజిక సమస్యల మీద సిపిఎం అనేక ఆందోళన చేసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాద ప్రయత్నాలను సిపిఎం ఎప్పటికప్పుడు ప్రజల తరపున ఆ పార్టీ విధానాలను ఎండ గట్టిందన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆందోళనను నిర్వహించామన్నారు. ఈనెల 27,28 నిర్వహించే జిల్లా మహాసభలో జిల్లాలోని రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజానికం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక చేపడతామన్నారు. కదిరిలో నిర్వహించే జిల్లా మహాసభలకుకార్మిక కర్షక ఉద్యోగులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, సాంబ శివ, జగన్మోహన్, ముస్తక్ అలీ, రామ్మోహన్, రఫీ, సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం : మంత్రి సవిత

ప్రజాశక్తి - పరిగి

కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో జగన్మోహన్ రెడ్డికి నిద్ర పట్టడం లేదని అందువల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి కుయుక్తులు చేస్తున్నారని మంత్రి సవిత ఆరోపించారు. పరిగి మండలంలోని కోడిగినహళ్లి పంచాయితీ బిందునగర్ లో ఎస్టేట్ బుల్ రియాల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్, సందీప్ శర్మ షాన్డిక్ ఫౌండేషన్ సునీల్ వర్మ సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆమె శుక్రవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పాలన అందించారని అన్నారు. పి నరసాపురం గ్రామంలో పర్యటించి ప్రభుత్వం సంక్షేమం పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వ అభివృద్ధిని చూసి వైసిపినాయకులకు నిద్ర రాలేదని ఏదో రకంగా బురదజల్లే కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, సోమప్ప, తెలుగు యువత నాయకులు ప్రవీణ్ రెడ్డి, కాంట్రాక్టర్ మహేష్ కుమార్, చెన్నకృష్ణారెడ్డి, నాగభూషణం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



మహిళల సమస్యలు వింటున్న మంత్రి సవిత

దేశాభివృద్ధిలో యువశక్తి కీలకం

ప్రజాశక్తి-హిందూపురం

దేశాభివద్ధిలో యువత ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని స్థానిక ఎన్. ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువశక్తే దేశాభివృద్ధిని సూచిస్తుందని పేర్కొన్నారు. జనాభా తగ్గుదల కూడా ఎన్నో సమస్యలకు కారణమవుతుందన్నారు. ఒకప్పటి చైనా జనాభా తగ్గిపోయి, భారతదేశం జనాభా ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందన్నారు. జనాభా పెరుగుదల అంతకంతకు పెరిగిపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం కాగా, జపాన్ లాంటి దేశాల్లో యువశక్తి పూర్తిగా నిర్వీర్యం కావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. జనాభా పెరుగుదల అవసరాన్ని కూడా కొన్ని దేశాలు గుర్తించి, తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, యన్.సి.సి ఆఫీసర్ డా. సరస్వతి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా. రవి నాయక్, ఎన్ఎస్ఎస్ పిఒ రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అమరేష్, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

ప్రజాశక్తి - బుక్కపట్నం



సబ్‌స్టేషన్ కార్యాలయం ముందు రైతుల నిరసన

మండల పరిధిలోని మారాల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ వేళపాల లేకుండా విద్యుత్‌కోతలు విధిస్తుండటంతో తాము నష్టపోతున్నామని వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్వాహకంతో వారం రోజుల్లోగా దాదాపు 20 వ్యవసాయం మోటార్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌కోతల వల్ల రైతుల మోటర్లు కాలిపోతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు కోతలు లేకుండా చేసి రైతులను ఆదుకోవాలని, లేనిచో తమ పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కలగజేసుకొని కరెంటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మధ్యవర్తిత్వంతో ప్రయోజనాలు

పజాశక్తి-హిందూపురం

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం, రాజీ పథక సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా సమయం వథా కాకుండా ఉండటమే కాకుండా ఆర్థికంగా కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం చెడిపోకుండా ఉంటాయన్నారు. మధ్యవర్తిత్వం కక్షిదారుల సమస్య పరిష్కారంలో ఎంతో దోహదపడుతుందని తెలిపారు. వ్యాజ్యం కన్నా మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం సంతృప్తికరమైన పరిష్కారంగా ఉంటుందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా పూర్తిస్థాయిలో కేసును పరిష్కరించడమే కాకుండా పున్హసమీక్షకు, అప్పీలుకు ఏమాత్రం అవకాశముండదన్నారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని కక్ష దారులకు సమస్యను పరిష్కరించడంలో సహకరించాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సమావేశంలో మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు సిద్ధు, రాజశేఖర్, కళావతి, సంతోషి కుమారి లతోపాటు న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మహిళల సమస్యలు వింటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, కూటమినాయకులతో కలసి మంత్రి పట్టణంలో శుక్రవారం పాదయాత్ర కొనసాగించారు. పట్టణం లోని శివానగర్, సంజయ్ నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, పిఆర్‌టి వీధుల్లో పర్యటించిన నాయకులకు ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. మురుగుకాలువల శుభ్రత, కాలువల, సీసీ రోడ్ల పునర్నిర్మాణం, తాగునీటి సరఫరాలో లోపాలు, పాడైపోయిన విద్యుత్ స్తంభాల మూలంగా ఏర్పడిన సమస్యలు, ముఖ్యంగా చేనేత కార్మికుల విద్యుత్ సమస్యలు, పింఛన్లు తదితర సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్ర, మండలాల అధ్యక్షులు చంద్ర, రాము, భాస్కర, ఓబులేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు సుధాకర్, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం

పాదయాత్రలో మంత్రి సత్యకుమార్ యాదవ్

కాటమయ్య, మహేష్ చౌదరి, నరేంద్ర, ఫణి కుమార్, జనసేన నాయకులు రాజారెడ్డి, శ్యామ్, డిష్ రాజు, ఎన్డీఏ కూటమి మహిళా నాయకురాలు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివానగర్ లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చెన్న రెడ్డి, సౌమ్య, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం నిర్వహించిన కొత్తచెరువులో పర్యటనలో నలుగురు విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు వారికి అధికారులు శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మవరం తహశీల్దార్ సురేష్ బాబు కొత్తచెరువు వెళ్లి విద్యార్థుల కుటుంబ సభ్యులతో కలిసి రూ. 30వేల విలువజేసే నాలుగు సైకిళ్లను అందజేశారు.



పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థులు

కల్తీ కల్లు, నాటుసారాను నిర్మూలించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాటు సారా కల్తీ కల్లును పూర్తిగా నిర్మూలించాలని అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య తెలిపారు. నంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా లోని ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాటు సారాను అరికట్టడం కోసం ప్రభుత్వం ప్రకటించిన నవోదయమ్ 2.0 కార్యక్రమం అమలు గురించి , జిల్లా లోని మద్యం షాపులు , బార్ల లైసెన్స్ దారులు అమలు చేయ వలసిన విధి విధానాల గురించి అధికారులతో చర్చించారు. అదే విధంగా జిల్లా లో కల్తీ మద్యం, కల్తీ కల్లు లేకుండా కల్తీ మద్యం తయారీ , అమ్మకం దారులపై పాత నిందితులపై గట్టి నిఘా ఉంచాలని, అదేవిధంగా పెండింగ్ కేసులలోని ఇన్వెస్టిగేషన్ సత్వరమే పూర్తి చేసి ఛార్జ్ షీట్ తొందరగా వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి డిపిఇఒ గోవింద నాయక్, ఎఇఎస్‌లు నరసింహులు, శ్రీరామ్ తో పాటు 8 మంది ఎస్‌హెచ్ఒలు, చెక్ పోస్ట్, బిఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు చట్ట నూతన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక ఆర్డీవో వివిఎస్ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వాటిని అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలలో చట్టాల పట్ల చైతన్యం కల్పించే విధంగా చొరవ తీసుకుంటామని గ్రామాలలో సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేసి వాటికి అనుగుణంగా పనిచేసే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన సహ చట్టం అధ్యక్షులు శ్యామ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ టిడి జయరామిరెడ్డి, ముఖ్య కార్యదర్శి వెంకటరమణ, రవికుమార్, సాంబన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ప్రభుత్వాలు సహకరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు అండగా ఉంటున్న ఆర్డీటీకి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడారు. కొత్తచెరువు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలవకుండా అధికారులు అడ్డుకోవడంపై అభ్యంతర వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విన్నవించేందుకు ఎం.ఎస్.ఎఫ్. ఆధ్వర్యంలో కొత్తచెరువుకు వెళితే అక్కడ పోలీసులు ఏమాత్రం సహకరించకుండా నిర్బంధించి అడ్డుకున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వబోతే అధికారులు పుట్టపర్తి విమానాశ్రయంలో నిర్బంధించడం హేయమైన చర్యగా ఆవేదన వ్యక్తం చేశారు. శాలువాలతో, బొకేలతో వత్తాసు పలికే నాయకులకే హత్తుకుంటారా, ప్రజాపాలనలో దళితులపై దాడులు అరికట్టాలని వినతులు ఇస్తే ఏమాత్రం పట్టించుకోరా అంటూ ప్రశ్నించారు. అధికారులు ఇలాంటి విధానాలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జై భీం పార్టీ నాయకులు నాగరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మంజు, రమేష్, హనుమంతు, మధు, నారాయణస్వామి, నాగరాజు, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.